క్లుప్తంగా

24న అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: పుష్య పౌర్ణమి పురస్కరించుకుని ఈనెల 24న అరుణాచలానికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ వన్ డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు బస్టాండులో బస్సులు బయలు దేరుతాయన్నారు. అల్ట్రాడీలక్స్ రాను పోను చార్జీలు రూ.805 చెల్లించాలన్నారు. ముందుగా టిక్కెట్లు రిజర్వు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9959225676, 7382875034ను సంప్రదించాలని కోరారు.

34 మంది అంగన్‌వాడీలు విధులకు హాజరు

తంబళ్లపల్లె: అంగన్‌వాడీలు సమస్యలు పరిష్కారానికి నిరవధిక సమ్మెకు దిగిన విషయం విదితమే. ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలకావడంతో వారు సమ్మెను కొనసాగించారు. అయితే విధులకు హాజరు కాకుంటే విధుల నుండి తొలగించాలని ఆదేశించడంతో ఐసీడీఏస్ పరిధిలోని తంబళ్లపల్లె, కురబలకోట, పెద్దమండ్యంకు చెందిన 34 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు విధులకు హాజరైనట్లు ఐసీడీఏస్ సీడీపీవో నాగవేణి తెలిపారు.

నాటు సారా విక్రేత అరెస్టు

కలికిరి: నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఏఎస్‌ఐ మధుసూదనాచారి తెలిపారు. కలికిరి క్రాస్ రోడ్డు ఏరియా నగిరిపల్లి క్రాస్ సమీపంలో నాటు సారా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా నగిరిపల్లి క్రాస్‌లో కాపురముండు కోలా నాగులు నాటు సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 17 లీటర్లు నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితున్ని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. దాడులలో హెచ్‌సీలు రాజేంద్రప్రసాద్, మదన్మోహన్‌రెడ్డి, మనోహర్, పీసీ జిలానీ పాల్గొన్నారు.

108 ప్యాకెట్ల అక్రమ మద్యం పట్టివేత

పెద్దతిప్పసముద్రం: మండలంలోని టి.సదుం సమీపంలోని అంకాలమడుగు చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ రవీంద్రబాబు సిబ్బందితో కలసి సోమవారం నాకాబందీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో ములకలచెరువు మండలం పర్తికోట పంచాయతీ చిటికివారిపల్లికి చెందిన నాగమణి (37) కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా 108 ప్యాకెట్ల మద్యం బస్సులో తరలిస్తుండగా తనిఖీలో పట్టుబడింది. సదరు మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఎస్‌ఈబీ సీఐగా రమేష్‌రెడ్డి



మదనపల్లె : ఎస్‌ఈబీ స్టేషన్, మదనపల్లె, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్స్‌పెక్టర్‌గా ఏ.రమేష్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో సీఐగా పనిచేస్తున్న మురళీకిషోర్ డిప్యుటేషన్‌పై రాయచోటికి వెళ్లడంతో రాజంపేట ఎస్‌ఈబీ సీఐ శ్రీహరిరెడ్డి ఇన్‌చార్జ్ సీఐగా ఇక్కడ బాధ్యతలు నిర్వహించేవారు. ప్రస్తుత సీఐ మురళీకిషోర్‌ను అనంతపురం జిల్లా కణేకల్లుకు బదిలీ చేశారు. నంద్యాల జిల్లా నందికొట్కూరులో సీఐగా పనిచేస్తున్న రమేష్‌రెడ్డిని మదనపల్లె ఎస్‌ఈబీకి బదిలీ చేశారు.

పీలేరు సెబ్ సీఐగా శ్యాంప్రసాద్



పీలేరు రూరల్ : పీలేరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ బి. శ్యాంప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ సీఐగా పని చేస్తున్న వై. గురుప్రసాద్ సత్యసాయి జిల్లా ధర్మవరంకు బదిలీ అయ్యారు. కర్నూలు జిల్లా కోడుమూరులో సీఐగా పని చేస్తున్న శ్యాంప్రసాద్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ సారా రహిత గ్రామాల నిర్మూలనకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

ఎస్‌ఈబీ సీఐ బాధ్యతల స్వీకరణ

ములకలచెరువు : ములకలచెరువు ఎస్‌ఈబీ సీఐగా రామమోహన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని నాటు సారా తయారీని అరికడతామన్నారు. కర్ణాటక మద్యం అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో నివారిస్తామన్నారు.

జగనన్న కాలనీకి నీటి సౌకర్యం



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న నాయకులు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని బూర్లపల్లి జగనన్న కాలనీలో లబ్ధిదారుల సౌకర్యార్థం నీటి సౌకర్యం కల్పించామని సర్పంచ్ సుబ్బిరెడ్డి, ఎంపీటీసీ నాగార్జునరెడ్డి తెలిపారు. కాలనీలో పక్కా గృహాల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు జలజీవన్ మిషన్ స్కీం ద్వారా రూ.9.38 లక్షల నిధులతో బోరు డ్రిల్లింగ్‌తో పాటు మోటారు, పైపులు, 650 మీటర్ల పైప్‌లైన్, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సౌకర్యం కల్పించామని ఆర్‌డబ్ల్యూస్ జేఈ హరి తెలిపారు. సదరు బోరును సోమవారం ఎంపీపీ మహమూద్, ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గణపతిరెడ్డి, కుంచే శ్రీనివాసులు, మహబూబ్ బాషా, మెకానిక్ చంద్ర, దీపాల వెంకట్రమణ, ఫుజేల్ లాంఛనంగా ప్రారంభించారు.

మార్మోగిన శ్రీరామ నామ స్మరణ

- అయోధ్య ఆలయ ప్రారంభోత్సవంతో ఆధ్యాత్మిక వాతావరణం
- వాడవాడలా రెపరెపలాడిన కాషాయజెండాలు
- పల్లెలు, పట్టణాల్లో శ్రీ రామజపం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానం, ప్రసాదాల పంపిణీ



వాల్మీకిపురం: దీపాలతో మహిళల ర్యాలీ



మదనపల్లె: ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం

మదనపల్లె : అంతా రామమయం...ఈ జగమంతా రామమయం అన్న రామదాసు కీర్తనలా... అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట, రామమందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది. పల్లె, పట్టణం తేడా లేకుండా ఎక్కడ చూసినా శ్రీరామ జపం కనిపించింది. వాడవాడల్లో.. ఇంటింటిపై కాషాయజెండాలు రెపరెపలాడాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, రామనామ సంకీర్తన, అఖండ రామజపం, ప్రవచనాలు, మహా మంగళహారతి, అన్నదానం, తీర్థప్రసాదాల పంపిణీతో సందడి సందడిగా కనిపించింది. ఉత్సవ విగ్రహాల ఊరేగింపులు, తిరువీధి వేడుకలు, భజనలు...రామభక్తుల కోలాటాలతో శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట, మందిర ప్రారంభోత్సవాన్ని ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌ల ద్వారా ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించి భక్తులు ఆనందపరవశులయ్యారు. భక్తులతో ఆలయాలు పోటెత్తాయి. పట్టణంలోని శ్రీ వరాల అంజనేయస్వామి ఆలయంలో జరిగిన పూజల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కౌన్సిలర్ సుగుణ, ప్రసాద్‌బాబు, ఈశ్వర్‌నాయక్, ఆంజనేయులు, సాయిశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. దేవళంవీధి శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో రాజంపేట పార్లమెంటరీ బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్, ప్రధాన కార్యదర్శి యల్లంపల్లె ప్రశాంత్, భక్తులు పాల్గొన్నారు. కురవంక పంచాయతీలో సర్పంచ్ చిప్పిలి చలపతి అధ్యక్షతన శ్రీ శంకర బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణంతో పాటుగా ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. కార్యక్రమంలో శంకర బ్రాహ్మణసేవాసంఘం అధ్యక్షులు కోదండరామయ్య, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక బర్మావీధిలోని షిర్డీసాయి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పాటుగా పూజలు చేశారు. మేదరవీధిలోని పిండాల అంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం చేశారు. బెంగళూరు బస్టాండులో పూలవ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం, పానకాల పంపిణీ చేశారు. ప్రశాంత్‌నగర్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు బాలగంగాధరరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. మదనపల్లె చౌడేశ్వరిసర్కిల్ ఆంజనేయస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ మైనారిటీ నాయకులు బాబ్‌జాన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. 20వవార్డులో స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో శ్రీరాముని చిత్రపటానికి పూలమాల వేసి వేడుకలు నిర్వహించారు.

దేదీప్యమానంగా దీపాల వెలుగులు

మదనపల్లె సిటీ: అయోధ్యలో బాలరాముని విగ్రహావిష్కరణ పురస్కరించుకుని సోమవారం రాత్రి మదనపల్లె పట్టణంలోని ఆలయాల్లో భక్తులు దీపాలు వెలిగించారు. దీపాల వెలుగులో ఆలయాలు శోభయమానంగా మారాయి. స్థానిక అయ్యప్పనగర్‌లోని బాల అయ్యప్పస్వామి ఆలయంలో భక్తులు మూడు వేల దీపాలు వెలిగించారు. స్థానిక సొసైటీకాలనీ రామాలయం, బీటీ.కాలేజీ వద్దనున్న వరాల ఆంజనేయస్వామి ఆలయం, అప్పారావువీధిలోని ఘటికాచల ఆంజనేయస్వామి ఆలయాల్లో దీపాలు వెలిగించారు. మహిళలు ఇళ్లల్లో రాముడి చిత్రపటం ఎదుట దీపాలు వెలిగించి పూజలు చేశారు.

సీతారాముల విగ్రహాల ఊరేగింపు

పీలేరు : అయోధ్యలో శ్రీరామ ప్రాణప్రతిష్ట సందర్భంగా శ్రీరామనామ స్మరణతో పీలేరు పట్టణం మార్మోగింది. సోమవారం పీలేరు పట్టణం నాలుగు రోడ్ల కూడలి నుంచి శ్రీరామాలయం వరకు సీతారాముల విగ్రహాలను ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కోలాటాలు, భజనలు, జైశ్రీరామ్ జెండాలు చేతబట్టి ఊరేగింపు నిర్వహించారు. వివిధ వేష ధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలతో జై శ్రీరామ్ అంటూ పెద్ద ఎత్తున నినదించారు. స్థానిక క్రాస్ రోడ్డులో శ్రీ వరసిద్ధి వినాయక కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అలాగే పంచాయతీ మిట్టన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కార్పెంటర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బెల్లం పానకం, మజ్జిగ భక్తులు పంపిణీ చేశారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందాం

వాల్మీకిపురం: సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందామని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పురవీధుల్లో జై శ్రీరాం జెండాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీ పట్టాభిరామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జై శ్రీరాం నామ స్మరణాలతో పట్టణం మారుమోగింది. అనంతరం శ్రీరాముడి నగరోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమంలో అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, స్థానికులు చింతల శివానంద రెడ్డి, కేశవ రెడ్డి, శ్రీధర్‌రాయల్, క్రిష్ణమూర్తి, లింగంశెట్టి శంకర, నీళ్లభాస్కర్, శంకర, రవి, సత్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామశోభాయాత్ర

గుర్రంకొండ: అయోధ్యలో బాలరాముని ప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకొని గుర్రంకొండతో పాటు పలు గ్రామాల్లో శ్రీరామా శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. స్థానిక కోటలోని శ్రీఆంజనేయ స్వామి దేవాలయం నుంచి శ్రీరామ ఉత్సవ విగ్రహాలను కోలహాలంగా ఉరేగించారు. పెద్ద ఎత్తున బాణాసంచాపేల్చుతూ, రామనామ సంకీర్తనలతో ఉరేగింపు కన్నుల పండుగగా నిర్వహించారు. కోలాటాలు, చెక్కభజన బృందాలు, మేళతాళాలతో ఇందిరమ్మ కాలనీ వరకు యాత్ర సాగింది. అక్కడే అందరికి ఉచితంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు శ్రీరాముడు, ఆంజినేయుడు, సీత, లక్ష్మణుడు వేషధారణలతో గ్రామపురవీధుల గూండా ర్యాలీ నిర్వహించారు. ఆలయాల్లో రామభజనలతో పలువురు మైమరిచిపోయారు.

రామాలయాల్లో ప్రత్యేక పూజలు

పెద్దమండ్యం: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా సోమవారం ప్రతి పల్లెలోని రామాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలకు ప్రత్యేక అలంకరణచేసి ఉదయం అభిషేకం, తీర్థ ప్రసాదాలు నిర్వహించారు. పెద్దమండ్యం, కలిచెర్ల, వెలిగల్లు, బిక్కావాండ్లపల్లె, పాపేపల్లె, బండ్రేవు గ్రామాలలో ఎంతో వైభవంగా రామాలయాలలో భక్తులు పూజలు నిర్వహించారు. కలిచెర్లలో రాములవారి చిత్రపటాన్ని పురవీధులలో భజనలు చేస్తూ ఊరేగించారు. పెద్దమండ్యం రామాలయంలో ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం నిర్వహించారు.

రామనామ స్మరణ

పెద్దతిప్పసముద్రం: అయోధ్యలో రామమందిరం ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని రామాలయాలు రామనామ స్మరణలతో మార్మోగాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆలయాలకు వెళ్ళి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. రామనామంతో భక్తులు పరవశంతో కీర్తనలను ఆలపించారు. యువకులు ఉత్సాహంతో బైకుల్లో ర్యాలీ నిర్వహించారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట సందర్భంగా మండలంలో ఊరూవాడ సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని వైఎస్సార్ సర్కిల్‌లో సీతారాముల చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు వడపప్పు, బెల్లం పానకం, ప్రసాదం పంపిణీ చేశారు. మరిమిరెడ్డిగారిపల్లె బస్టాండులోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కన్నెమడుగు రామాలయంలో విద్యుత్‌దీపాలు, పూలమాలలతో అలంకరించారు. జై..శ్రీరామ్ నామస్మరణతో ఊరేగింపు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

రామసముద్రం: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా మండలంలోని పల్లెలన్ని సోమవారం రామ నామస్మరణతో పులకించాయి. ఊరు,వాడ శ్రీరామాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతా,లక్ష్మణ, హనుమత్ సమేత శ్రీరాముడి చిత్రపటాలను ఏర్పాటు చేసి పూజాది కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు, జానపద నృత్యాలతో ఊరేగించారు. పల్లెల్లో ఎక్కడా చూసినా కోలాహలం కనిపించింది. రామసముద్రం – చెంబకూరు ప్రాంతాలల్లో కుల,మతవర్గాల, రాజకీయాలకు అతీతంగా ప్రజలు స్వచ్ఛందగా గ్రామాలను అలంకరించి అయోధ్య నుంచి వచ్చిన అక్షితలకు పూజలు చేశారు. రామభక్తులు భారీ ర్యాలీలు నిర్వహించారు.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్టను పురస్కరించుకుని సోమవారం వాడ వాడలా శ్రీరాముని నామస్మరణ మార్మోగింది. స్థానిక పోకనాటివీధిలోని కోదండరామస్వామి ఆలయంలో బాలరాముని ప్రాణప్రతిష్ట సమయంలో భారీగా బాణసంచా కాల్చి, మహామంగళహారతి ఇచ్చారు. భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో అన్నదాన కార్యక్రమం చేశారు. సాయంత్రం రథంపై సీతారామ లక్ష్మణుల ఉత్సవ మూర్తులతో పట్టణంలో వైభవంగా ఊరేగించారు.

గ్రామ గ్రామానా రామనామ కీర్తనలు

కలకడ : అయోధ్య రామాలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో భాగంగా మండలంలోని గ్రామ గ్రామానా రామ నామ కీర్తనలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదానం చేశారు. రామాలయాలలో ప్రత్యేక పూజలతోపాటు భజనలు, కోళాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.



వాల్మీకిపురం: శ్రీరాముని చిత్రపటం ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే చింతల



మదనపల్లె: కురవంక పంచాయతీలో సీతారాముల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



పీలేరు పట్టణంలో ఊరేగింపు చేపడుతున్న రామభక్తులు



గుర్రంకొండలో శ్రీ రామశోభాయాత్ర











పెద్దతిప్పసముద్రం: బూర్లపల్లిలో పూజలు, తంబళ్లపల్లె: భక్తులకు ప్రసాదం అందజేస్తున్న దృశ్యం, పెద్దమండ్యం: కలిచెర్లలో రాములవారి చిత్రపటం ఊరేగింపు, బి.కొత్తకోటలో సీతారామ లక్ష్మణ ఉత్సవ మూర్తుల ఊరేగింపు, రామసముద్రం: చెంబకూరులో పూజలు

మహిళా ఓటర్లే అధికం

కురబలకోట: కేంద్ర ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తంబళ్ళపల్లె అసెంబ్లీ నియోజక వర్గ ఓటర్ల తుది జాబితాను నియోజక వర్గ ఎన్నికల అధికారి రాఘవ్రేంద్ర సోమవారం విడుదల చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలోని ఆరు మండలాల్లో 2,14,560 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. వీరిలో పురుషులు 105984, మహిళా ఓటర్లు 108566, 10 మంది ఇతర ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. మహిళా ఓటర్లు అధికంగా ఉన్నట్లు తెలిపారు. మండలాల వారిగా బి.కొత్తకోట మండలంలో 47,874 మంది ఓటర్లు ఉండగా పురుషులు 23289 మంది మహిళలు 24283 మంది, ఇతరులు ఇద్దరు ఉన్నారు. పీటీఎం మండలంలో 39864 మంది ఓటర్లు ఉండగా 19869 మంది పురుషులు, 19994 మంది మహిళా ఓటర్లు,ఒక్కరు ఇతరులు ఉన్నట్లు తెలిపారు. ములకల చెరువు మండలంలో 35972 మంది ఓటర్లు ఉండగా 17667 పురుషులు,18305 మహిళలు, కురబలకోట మండలంలో 32,955 ఓటర్లు ఉండగా ఇందులో 16137 పురుషులు, 16818 మహిలా ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. తంబళ్లపల్లె మండలంలో 31477 మంది ఓటర్లు ఉండగా పురుషులు 15563 పురుషులు, 18305 మహిళలు, ఇద్దరు ఇతర ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. పెద్దమండ్యం మండలంలో 26418 మంది ఓటర్లు ఉండగా 13159 పురుష ఓటర్లు, 13254 మంది మహిళా ఓటర్లు ఐదు మంది ఇతర ఒటర్లు ఉన్నట్లు తెలిపారు.

ఆస్పత్రులపై దాడులకు పాల్పడితే చర్యలు

పీలేరు రూరల్ : ఆస్పత్రులపై దాడులకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ప్రసాద్ ఆస్పత్రిలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించే కాపాడాలని ప్రతి వైద్యుడు కోరుకుంటారని పేర్కొన్నారు. వైద్యులు దైవంతో సమానమని, అలాంటి వైద్యులపై దాడులకు దిగడం, దుర్భాషలాడడం, దురుసుగా వ్యవహరించడం, ఆస్తులు ధ్వంసం చేయడం సమంజసం కాదని తెలిపారు. అలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపట్ల కఠినంగా వ్యవహిస్తామని చెప్పారు. యూనియన్ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ వైద్య వృత్తిలో ఓర్పు, సహనంతో సమస్యను అర్థం చేసుకునేతత్వం ఉంటుందన్నారు. రోగి తరపున బంధువులు ధైర్యం చెబితే మెరుగైన వైద్యం అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు డాక్టర్ ఈశ్వరసురేంద్ర, డాక్టర్ రాజాసాహెబ్, డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న కుటుంబాలకు ఆరోగ్యశ్రీ కార్డులు

పీలేరు : అర్హత ఉన్న కుటుంబాలకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తామని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ దయాసాగర్ అన్నారు. సోమవారం పీలేరు 1వ గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అర్హులందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఈకేవైసీ చేయాలన్నారు. 3257 రకాల వ్యాధులకు రూ. 25 లక్షల వరకు ఉచితంగా చికిత్స పొందవచ్చునని తెలిపారు. అధికారులు సమన్వయంతో పని చేసి వీలైనంత త్వరగా కార్డులు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా కోర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్, డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్, హెచ్‌ఈ రఫీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదల కోసం మళ్లీ జగన్ సీఎం కావాలి

వాల్మీకిపురం: పేదల సంక్షేమం కోసం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ సీఎం చేయాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ కడప పెద్ద దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సోమవారం స్థానిక ముస్లిం యువతతో కలసి ఆయన కడపలోని అమీన్ పీర్ పెద్ద దర్గాను సందర్శించారు. రాష్ట్రంలో పేద వర్గాల సంక్షేమం కోసం పరితపిస్తూ సామాజిక న్యాయం దిశగా సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మరో పది కాలాలపాటు పరిపాలించే అవకాశాన్ని, శక్తిని ఇవ్వాలని వేడుకున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలను రాబోవు ఎన్నికల్లో మళ్లీ గెలిపించి ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలందరూ సంక్షేమ పాలనకే పట్టం కట్టాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ యువ నాయకులు అలీ అన్సర్, సమీ, అజ్మత్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

నిమ్మనపల్లె : నిమ్మనపల్లెలోని ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. మదనపలెల భూ సంరక్షణ విభాగం వ్యవసాయ అధికారి ఎం.కృష్ణవేణి, వ్యవసాయ అధికారి మురళీమోహన్‌తో కలిసి స్టాకు వివరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలన్నారు. విక్రయించిన ఎరువుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. దుకాణాల్లో తూనికలు, కొలతలను పరిశీలించారు. వ్యవసాయ పంటల పిచికారీ మందులను నమూనాల కోసం సేకరించారు. దుకాణాల లైసెన్స్‌లను, రసీదులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

జగనన్న మళ్లీ సీఎం కావాలని పాదయాత్ర

పెద్దతిప్పసముద్రం: ముఖ్యమంత్రిగా మళ్ళీ జగనన్న కావాలని కోరుతూ మండలంలోని టి.సదుం పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సోమవారం తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. పంచాయతీలోని గుంటిపల్లికి చెందిన వార్డు సభ్యుడు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో 34 మంది పాదయాత్రగా బయలు దేరారు. రాబోవు ఎన్నికల్లో సీఎంగా జగనన్నతో పాటు తంబళ్ళపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి మంత్రి కావాలని ఆకాంక్షిస్తూ యాత్ర చేపట్టామన్నారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ పాదయాత్రలో పాల్గొన్న వారందరికి భోజన సౌకర్యాన్ని ఉప సర్పంచ్ పీఎస్ మధూకర్‌రెడ్డి సమకూర్చినట్లు వెంకటరెడ్డి పేర్కొన్నారు.

కలకడ ఎస్‌ఐగా రామక్రిష్ణారెడ్డి



కలకడ : కలకడ ఎస్‌ఐగా రామక్రిష్ణారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్న తిప్పేస్వామిని జిల్లా పోలీస్ కార్యాలయాని బదిలీ చేశారు. సుండిపల్లె ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న రామక్రిష్ణారెడ్డి కలకడకు బదిలీ పై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల సంరక్షణ, ప్రమాదాలు, చోరీల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

గుండ్లూరులో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

కలికిరి: మండలంలోని గుండ్లూరులో సోమవారం గుండ్లూరులో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీఓ గంగయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, అర్హులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌కుమార్ రెడ్డి, సర్పంచ్ సైఫుల్లా, ఏపీఓ సుజాత, గ్రామస్తులు పాల్గొన్నారు.

‘జగనన్నకు చెబుదాం’కు హాజరుకావాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : ప్రజాసమస్యల పరిష్కారానికి రాష్ట్రప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తూ... జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రవేశపెట్టిందని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి డివిజనల్ స్థాయి అధికారులు హాజరుకాకుండా, కిందిస్థాయి ఉద్యోగులను పంపి, కార్యక్రమ ఆశయానికి తూట్లు పొడిస్తే ఏమాత్రం సహించేది లేదని హెచ్చరించారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి డివిజనల్ స్థాయి అధికారులు హాజరుకాకుండా, తమ శాఖలోని కిందిస్థాయి ఉద్యోగులను పంపడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ఎంతో ప్రాధాన్యత ఉందని, ప్రజలు ఎంతో నమ్మకంతో సమస్యల పరిష్కారం కోసం వ్యయ,ప్రయాసలకు ఓర్చి సబ్‌కలెక్టరేట్‌కు వస్తే వారిని పదే పదే తిప్పించుకోవడం ఏమాత్రం సరికాదంటూ చురకలంటించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి హాజరుకాని డివిజనల్ స్థాయి అధికారులకు మెమోలు జారీచేయాల్సిందిగా ఆదేశించారు. పట్టణంలోని ఫైర్ ఇంజన్ కార్యాలయం వద్ద 30 సంవత్సరాలుగా ఉన్నటువంటి లైబ్రరీని మున్సిపాలిటీ అధికారులు శానిటరీ సిబ్బందికి కేటాయించారని ఫిర్యాదుచేశారు. వృద్ధులకు, విద్యార్థులకు, నిరుద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నటువంటి లైబ్రరీని మూసివేసి శానిటరీ సిబ్బంది సామగ్రిని భద్రపరచుకునేందుకు కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, నెహ్రూనగర్ సీనియర్ సిటిజన్స్ ఆర్డీఓ మురళీకి ఫిర్యాదు చేశారు. మండలంలోని కోటవారిపల్లె గ్రామంలో ఖాతానెం.1173లో సర్వే చేయాల్సిందిగా చలాను చెల్లించి ఏడాది కావస్తున్నప్పటికీ ఇప్పటివరకు సర్వేయర్ రాలేదని, దీంతో పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు కాక ఇబ్బంది పడుతున్నామని కోటవారిపల్లెకు చెందిన ఉత్తన్న ఫిర్యాదు చేశారు.

ఆలయ నిర్మాణానికి రూ. 2 లక్షలు



విరాళం అందజేస్తున్న దాతలు

పీలేరు రూరల్ : మండలంలోని వేపులబైలు పంచాయతీ జంగంపల్లె వద్ద పునర్నిర్మాణం చేపడుతున్న అంకాలమ్మ ఆలయానికి దాతలు రూ. 2,00,232 విరాళం అందజేశారు. పీలేరు పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పెప్సీ చలపతి, చంద్రకళ దంపతులు రూ. 1,00,116, పీలేరు పట్టణానికి చెందిన ఎంపీటీసీ స్టాంపుల నరసింహారెడ్డి, శారదమ్మ దంపతులు రూ. 1,00,116 విరాళం అందించారు. సోమవారం ఆలయ చైర్మన్ భవనం వెంకటరమణారెడ్డి, నాగభూషణంరెడ్డిలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి దాతలు చేసిన సహకారం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మధుసూదన్‌రెడ్డి, గాయం భాస్కర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాలల రాష్ట్ర కార్యదర్శిగా రమణారెడ్డి

కురబలకోట: రాష్ట్ర ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోషియేషన్ కార్యదర్శిగా మండలంలోని అంగళ్లు గోల్డన్‌వ్యాలీ విద్యా సంస్థల నిర్వాహకులు ఎన్వీ రమణారెడ్డి ఎంపికయ్యారు. విజయవాడలో అసోషియేషన్ కేంద్ర కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుంటూరు వీవీఐటీ కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యా సాగర్, ప్రధాన కార్యదర్శిగా మధుసూధన్ రావు, కార్యదర్శిగా గోల్డన్‌వ్యాలీ రమణారెడ్డి, కోశాధికారిగా గ్రంధి సత్యనారాయణ రావు ఎంపికైనట్లు అసోసియేషన్ తెలిపింది. కళాశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుకు, మెరుగైన ఫలితాలకు, ప్రభుత్వ లక్ష్య సాధనకు పాటుపడతామని రమణారెడ్డి తెలిపారు.